

దృఢనిశ్చయంతో
కృషిచేయి
దీక్షతో
పనిచేయండి

ఫోటోగ్రఫీలో
మీ అవసరాలు అన్నిటికీ -
గ్రూప్ ఫోటోలు ఫ్లాష్ బల్బులు
ఎన్‌లార్జిమెంట్లు
ఫోటోగ్రఫిక్ సరకులు
సిల్వానియా ఫ్లాష్ బల్బులు
సరసమైన ధరలకు
మమ్మల్ని సంప్రదించండి
మెకో స్టూడియోస్,
(ఎయిర్-కండిషన్డ్)
గ్లోబ్ థియేటర్ ప్రక్క,
2/18-సి, మౌంట్ రోడ్డు,
మద్రాసు- 2.
టెలిఫోన్ : 86098

గజ్జి దురద
మీ చర్మములోగల కోట్లకొలది సూక్ష్మరంధ్రము లలో అనేక విధములగు క్రిమి జాలములు దాగి యుండి చర్మమునకు దురద, పగుళ్ళు, కలిగించుటయేకాక గజ్జి, చర్మము రాలుట, చర్మము మంట, చీమ, తామర, పొడ, మొటిమలు, పాదము లలో దురద, తదితర లక్షణములను పుట్టించును. సాధారణ చికిత్సల ద్వారా క్రిములు నశించకుండుటచే తాత్కాలిక ఉపశాంతి మాత్రమే కలుగును. శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM)తో వెంటనే క్రిములు నశించుటయేగాక మీ చర్మము మృదువుగాను,శుభ్రముగాను ఉండుటకు యీ మందు తోడ్పడగలదు. చర్మ వ్యాధులకు కారకమైన క్రిములను నిశ్చయముగా సంహరించు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

# శాపగ్రస్తుడు

( 8 వ పేజీ తరువాయి)

భరింపలేని కాలపురుషుడు. అతని ఆర్తనాదం దిక్కుల ప్రతిధ్వనించింది.

అది విన్న ప్రకృతి లలామ ఫక్కున నవ్వింది. తనను చూసీ చూడనట్లు నటించి ముందుకు పోతున్నందుకు తగిన శాస్తి జరిగిందిలే అనుకుంది. కానీ అంతలోనే — స్త్రీ హృదయం కదూ — విచారించింది.

కాలపురుషుని ఆక్రందనం ఆలించిన గోడ గడియారాలు గొల్లున వెక్కివెక్కి ఏడ్చాయి.

నిశాకన్య ఒడిలో నిద్రపోతున్న జనాళికి నిషావీడలేదింకా. కొద్దిగా తెలివిగాంచి కాస్త ఒత్తిగిల్లి మత్తుగా నిద్రలో మునిగిపోయింది.

బ్రాందీ నిషాలో ఉన్న మానవుని మల్లే, స్త్రీవాంఛలో పడ్డ కామార్తుని మల్లే నిద్ర మత్తులో ఉన్న మానవాళికి కూడ తన చుట్టూ ఉన్న పరిసరాలలో ఏమి జరుగుతున్నదో ఏమీ తెలియదు. కాలనాథుని ఆక్రందనాలు, గడియారపు ఘోషలు, ప్రపంచపు టరుపులు విన్పించవు. విన్పించినా ఆ నిషా హుషారులో, వాంఛల తపనలో, మత్తుల మైమరపులలో ఉన్న మానవజగతి ఏమీ పట్టించుకోదు.

అదేకోవకు చెందిన మానవులు మరికొందరున్నారు. వారే రచయితలు. రచనావ్యాసంగమొక వ్యసనం వారికి.

ఆ అర్ధరాత్రి సమయాన భాస్కర్ అనే రచయిత ఒంటరిగా ఒక టేబిలుముందు కూర్చొని కాగితాల దొంతి ముందుంచుకొని ఏదో రచన చేస్తున్నాడు. వ్రాస్తూ వ్రాస్తున్నవాడల్లా తక్కున ఆగి కనులు మూసుకొని బొమలు ముడివేస్తూ, నుదుటిపై కలంతో నెమ్మదిగా కొట్టుకుంటున్నాడు. అతని మస్తిష్కంలో ఏదో భావ సంఘర్షణ చెలరేగుతున్నది.

"అర్ధరాత్రి గతించింది. పడుకో, మిత్రమా" అని పన్నెండు మార్లు ఎదురుగా గోడకు జేరగిలబడి నిల్చున్న గడియారం ప్రబిమాలుకుంది.

అత నీ లోకంలో ఉంటేకదా వినటానికి? రచనా వ్యసనపు నిషాలో మునిగి ఏ ఊహా లోకంలోనో తేలియాడుతున్నట్లుంది.

డూములోంచి కాంతి పుంజాలను గ్రక్కుతున్నది — టేబిలు లాంపు.

రెక్కలు ముక్కలయేటట్లు గాలిని విసరుతున్నది — సీలింగు ఫాను.

బరువైన పేపరువెయిటు క్రిందున్న కాగితాల దొంతిలో ఊపిరి సలుపక గిజగిజలాడుతున్నాయి — రచయిత సృష్టించిన పాత్రలు — జీవాలతో.

పదహారు వసంతాలను తన అందమైన శరీరావయవాల వంపులలో దాచుకొని దివ్యంగా వెలిగిపోయే జవ్వని ఒకర్తె భయంతో వణికిపోతూ భాస్కర్ ముందు నిల్చొని కడు దీనంగా విలపిస్తున్నది.

"నన్ను చంపకు... నన్ను చంపకు.... నీకు పుణ్యముంటుంది.... రచయితవు.... ప్రాణికోటి కష్టసుఖా లరసి, సానుభూతి చూపవలసిన నీవే ఇంత నిర్దాక్షిణ్యంగా చంప బూనుకుంటే ఇక నే నెవరివద్దకు పోయి మొరపెట్టుకునేది?" పొంగి వచ్చే దుఃఖాన్ని అపుకొనడానికి గాను పమిటచెంగు నోటికడ్డంగా పెట్టుకుంది ఆమె.

భాస్కర్ ఆమె మొరాలించినట్లు లేదు. ఆమెను హతమార్చాలనే స్థిర సంకల్పంతో ముందుకు వంగాడు. ఆమె వెనుకకు తగ్గింది.

"లాభంలేదు, సుశీలా! నిన్ను కడతేర్చనిదే నేను నిద్రపోను." కఠినంగా పలికింది భాస్కర్ గొంతుక.

"స్త్రీహత్యా పాపం చుట్టుకుంటుంది నీకు." దివ్యాస్త్రాన్ని ప్రయోగించిందామె కడసారిగా.

అతని హృదయం ఒకింత జంకింది. నిశ్చయం సడలింది.

"నాకు తెలుసు — రచయితలు దయార్ద్ర హృదయులని." అతని హృదయదౌర్బల్యాన్ని కనిపెట్టిన సుశీల నెమ్మదిగా ఉబ్బించడానికి ప్రయత్నిస్తూంది.

"పోనీ, నీ అంతట నీవే చనిపోకూడదూ?" అమాయకమైన ప్రశ్నవేశాడు భాస్కర్.

"ఏమిటేమిటీ! ఆత్మహత్యా!! అంతకంటే మహాపాపం మరొకటుందా???....నీకుమాత్రం ఆ విషయం తెలియదు గనుకనా?" చివురించిన ఆశలతో హుషారుగా అంది సుశీల.

అతను కొద్దిసేపు మౌనంగా కూర్చున్నాడు.

ఇదే సమయమని ఆమె మరికాస్త దీనంగా అంది ఇలా: "యౌవనం వాడకముందే, వాంఛలు తీరకముందే, ఆనందాన్ని ఆస్వాదించకముందే వికసించిన యీ జీవన కుసుమాన్ని త్రుంచి వేస్తాననటం భావ్యంకాదు."

"ఇంతవరకూ మధూతో నీవనుభవించినదేమిటి?" కనుబొమ లెగరేస్తూ అడిగాడు భాస్కర్.

"ఏమున్నది?... ఏమీలేదు.... ఏదో కొద్దిపాటి ఆనందం... దానితో సంతృప్తి కలుగలేదు." సిగ్గుపడుతూ తలవంచుకొని అంది సుశీల.

"జీవితమున్నంతకాలం ఏవో కోరికలు ఉండనే ఉంటాయి. అవి తీరేదెప్పుడు? సంతృప్తి పొందే దెపుడు?? నీమాత్రపు సంతృప్తినైనా పొందకనే ఎంతోమంది అభాగ్యులు యీ జీవన రంగంనుంచి మౌనంగా నిష్క్రమించారు. వారందరూ నీలా అల్లరి చేశారా?" తీక్ష్ణంగా ఆమె కండ్లలోకి చూస్తూ అడిగాడు భాస్కర్.

"యమునిలా నా యెదుట నిల్చున్నావుకాబట్టి నావేదన నివేదించుకుంటున్నాను. ఇక వారి సంగతంటావా? — మృత్యువు వారి జీవాలను పిండేటపుడు ఎదురించలేక, ఎదురించి ఓడిపోయి ఎన్ని జీవుల ఆత్మలు ఆరాటపడ్డాయో, మౌనంగా ఘోషించాయో నీకేమైనా తెలుసా?

తెలుసు.... తెలుసుకోగల శక్తి నీకుంది. మృత్యు ముఖంలోకి పోయే వ్యక్తుల అండనిలిచి, దానితో పోరాడి, ఎన్నో ప్రాణాలు కాపాడావు. అంతటి దయాళువివి నాపైన కక్షకట్టి, నాపాలిట యమునిలా ఎందుకు తయారయ్యావో బోధ పడటం లేదు." కన్నీళ్ళు చీరకొంగుతో తుడుచు కుంది.

"అందుకు కారణం నీవే. వెన్నెల రాత్రిళ్ళలో, వలపు కౌగిళ్ళలో అమరసుఖా న్ననుభవిస్తూ నీవూ, నీ మధూ చేసుకున్న బాసలు.

"విధివశాత్తు మీలో ఎవరు ముందు విగత జీవులైనా రెండవవారు వెంటనే మొదటివారిని అనుసరించాలని, ఆవిధంగా మరో లోకంలోనూ, మరో జన్మలోనూ కలుసుకొని యిలాగునే హాయిగా జీవితాలు గడపాలని ప్రతినలు చేసు కోలేదూ?" కోపంతో వణికిపోతూ అడిగాడు భాస్కర్.

"భాస్కర్! నిజం చెబుతాను విను. నాకు సాహిత్యమంటే ప్రాణం. మధూ గొప్ప రచయిత. అతని సాహిత్యం నా మనస్సును కదిపివేసేది. అందుకనే అతనితో చెలిమి చేసుకున్నాను. నా స్నేహాన్ని తప్పుగా అర్థం చేసుకొన్న కాల వాహిని నన్ను ప్రేమవాహినిలోకి త్రోసివేసింది. ఇదేమిటని ప్రశ్నించితే 'అది అంతే....యౌవ నంలో ఉన్న స్త్రీ పురుషుల మధ్య ఉండవలసింది ప్రేమేకాని, స్నేహం కా'దని సమాధానం ఇచ్చాడు కాలపురుషుడు.

"ఆవిధంగా ప్రేమించుకున్నాం. నీవన్నట్లు ఆ ప్రేమమైకంలో ఏదేదో అనిఉంటాము. ఆ మాటలు పట్టుకొని యిప్పుడు నీవు దండిం డం ఏమంత సబబుగా లేదు." చిలిపిగా చూస్తూ అన్నదామె.

ఆమె చిలిపి కండ్లలోకి చూస్తున్నాడు — అతను.

ఆమె పమిట జారింది—గాలికి.

'రాతిగుహలో బంధింపబడివున్న అజంతా సుందరి తప్పించుక వచ్చి తన ముందు నిల్చున్నదా!!!' ఉన్నతమైన ఆమె అవయవ సౌందర్యం చూసి అతని కవితాహృదయం వెలిబుచ్చినభావనయిది.

అతని గొంతుకలోని కాఠిన్యం, కనుచూపుల లోని తీవ్రత తగ్గాయి. నెమ్మదిగా ఇలా అన్నాడు: "నేనేమి చేసేది, సుశీలా! హంతకుడుగా కావలసి వచ్చినందుకు నా హృదయ మెంత తల్లడిల్లి పోతున్నదో, చెప్పినా అర్థం కాదు నీకు. ఈ న్యాయ స్థానాన్ని అధిష్ఠించి కసాయివాడుగా మార వలసి వస్తుందని మొదటే తెలిసుంటే చాల దూరంగా ఉండి ఉండేవాడిని. ఇప్పుడు న్యాయం నన్ను నిస్సహాయుణ్ణి చేసి ఉంచింది.

"నీ మధూ ఆత్మ నన్ను నిలదీసి తనకు న్యాయం చేకూర్చమని అడుగుతున్నది."

"చనిపోక తప్పదా?" ఆమె కనులలో దీనత్వం కన్పిస్తుంది.

"సుశీలా! నీవింత పిరికిదానివిగా తయా రవుతావనుకోలేదు. నీ ప్రేమ ఇంత అస్థిరంగా ఉంటుందని కలనైనా తలంచలేదు. మధూ నీ మాటలు నమ్మి మోసపోయాడు."

"అట్లా అనకు, భాస్కర్. తల్లితండ్రులు కనుల్రెరజేసినా, సమాజం పల్లికిలించినా లెక్క జేయకుండా మధూని ప్రేమించి పెండ్లి చేసు కున్నాను." గర్వంగా చెప్పింది సుశీల.

"అడిగినదానికి సమాధానం చెప్పకుండా డొంక తిరుగుడు సమాధానం చెబుతావేం? నిజమే. నీవు ప్రేమించావు. కాదనలేదు. ఆ ప్రేమంతా యిపుడేమయింది? అతని 'చితి'లో ఉంచి కాల్చిపారేశావా? నిజమైన ప్రేమికు లెపుడూ ఒకరిని విడిచి ఒకరుండలేరు. అవునో కాదో గత చరిత్రలు జ్ఞప్తికి తెచ్చుకో—లైలా మజ్నూ, రోమియో జూలియట్, పారూ దేవదా.... వాళ్ళది నిజమైన ప్రేమ. నీది...నీది.. తృష్ణ!" కోపాన్ని దిగమింగుకుంటూ అన్నాడు భాస్కర్.

"కానీ, నీవన్నదే నిజమనుకో... అతని నొక రచయితగా ప్రేమించానని చెప్పనే చెప్పాను. అతను మృత్యువు చేతిలో నలిగిపోయాడు. అతనితోబాటు అతని కవిత్వం గతించిపోయింది. కాలగర్భంలో పడి నా ప్రేమకూడా నశించి పోయింది. కానీ, కోరికలు మాత్రం ఇంకనూ నశించలేదు. కాబట్టే నన్ను విడిచిపెట్టు— తీర్చుకుంటాను" అంది ఎదుట గోడకున్న ఉమర్‌ఖయ్యాం బొమ్మ చూస్తూ.

"నాకు తెలియక అడుగుతాను, సుశీలా! నీవిక జీవించి ప్రయోజన మేమిటి? నీవనే యౌవనపు తృష్ణ ఎలా తీరుతుంది??" చేతిలోని కలం టేబిలుపై ఉంచి, సిగరెట్టు ముట్టిస్తూ అడిగాడు భాస్కర్.

ఆమె పకపక నవ్వింది. ఆమెనవ్వు 'ఈ మాత్రం తెలుసుకొనలేనివాడివి యింత పెద్ద రచయిత వెలా అయ్యావయ్యా?' అని హేళన చేసినట్లుంది.

ఆమె నవ్వుతూనే సమాధానం చెబుతున్నది: "భర్త చనిపోతే వాంఛలు తీరనే తీరవా? ఇక లోకంలో పురుషులు లేరా?? స్త్రీ కన్నెత్తి చూస్తే చాలు, కోకొల్లలుగా వచ్చి పడతారు — ఆమె కాళ్ళపైన. అంతవరకూ ఎందుకు...... నీ....."

"ఏమి టేమిటీ! పరపురుష సాంగత్యం అభిల షిస్తున్నావా!? హిందూ స్త్రీగా నీకున్న భావాలు, మార్చుకుంటానంటావా! నిజంగా నీవే అంటు న్నావా యీ మాటలు!!!" భాస్కర్ ఆశ్చర్యంగా నోరు తెరిచాడు. సిగరెట్ క్రింద రాలిపోయింది.

"చచ్చు ధర్మశాస్త్రాలు వల్లించక నాదగ్గర." అతని మాటలకు అసహ్యించుకుంటూ బిగు తుగా ఉన్న జాకెట్టు ముడి సడలించి స్వేచ్ఛగా గాలి పీల్చుకుంది సుశీల.

రచయిత గుండెల్లో రైళ్ళు పరుగెడు తున్నాయి. అతి కష్టంపై గుండెల అదురును



సంతనుంచి

చిత్రం — కదార్ల శేషయ్య (మిర్యాలగూడ)

అదిమి పట్టుకొని, "సుశీలా! శీలాన్ని చెరచుకుంటావా? హిందూస్త్రీలు దేనినైతే ప్రాణప్రదంగా చూసుకుంటారో దానిని తృణప్రాయంగా చూస్తున్నావా?..... నీ వాంఛలకు హిందూ సంప్రదాయాల్ని బలిచేయకు. స్త్రీజాతికి కళంకం ఆపాదించకు" అని ఇంచుమించు బ్రతిమాలుకుంటున్న ధోరణిలో అన్నాడు.

ఆమె ఇతని మాటలేమీ వింటున్నట్లు లేదు. ఎదురుగా ఉన్న అద్దంలో తన సౌందర్యాన్ని అన్ని కోణాల్లోనూ చూసుకుంటున్నది.

భాస్కర్ ఆమె భంగిమలను చూస్తూ మరొక సిగరెట్టు ముట్టించాడు. గట్టిగా దమ్ము లాగి ఆమె ముఖంపైకి పొగ ఊదాడు.

ఆమె నవ్వి ఊరకుంది.

'అమాయకుడా! చేతికి దొరికిన పసిడి బొమ్మను జారవిడుచుకుంటున్నావు సుమా!' అన్నట్లు వెక్కిరిస్తున్నాయి ఆమె చూపులు.

అతను తన చూపులను ఆమెపైనుంచి మరల్చి సిగరెట్టు నుసిని ఏష్‌ట్రేలోనికి విదల్చుతూ "నిన్ను కన్న తండ్రి నీ జీవితమున్నంత కాలం 'సు—శీల'వుగా బ్రతకమని కోరుతూ, ఆ విషయం సదా నీకు జ్ఞాపకం చేయడానికి సుశీల అనే నామకరణం చేశాడు. కాబట్టి నీ పేరు సార్థకం చేసుకొని, నీ తండ్రి ఆశయాన్ని నెరవేర్చు" అన్నాడు.

"ఒకరి ఆశయాలకు నా జీవితాన్ని బలి చేసుకోను. హైందవ సంప్రదాయాలతోను, సమాజపు నిబంధనలతోను, తలిదండ్రుల ఆశయాలతోను నాకు పనిలేదు. నా జీవితం నాది. నా యిష్టమొచ్చినట్లనుభవించడానికి హక్కుంది నాకు, మీరెవరు నాకు నీతులు గరపడానికి?" నాసాపుటా లెగురవేస్తూ హూంకరించిందామె.

తెల్లబోయి దిక్కులు చూస్తున్నాడు భాస్కర్. ఆమె అడిగినదానికి సమాధానం చెప్పలేక తికమక పడుతున్నాడు. 'ఒక వ్యక్తికి తన సొత్తును తాను ఇష్టమొచ్చినట్లు వినియోగించుకోవడానికెంత అధికారముందో అదేవిధంగా తన జీవితాన్ని అనుభవించడానికి అంత హక్కూ ఉంది' అని తనకు తాను సమాధానం చెప్పుకున్నాడు భాస్కర్.

'జీవితాన్ని సాధారణపు సొత్తుతో పోల్చకు.' అతనిలోని సామాజిక హృదయం అరిచింది.

అది విన్న భాస్కర్ ఆమెకు సమాజం గురించి బోధించే ధోరణిలో "సుశీలా! సమాజంలో నీవు నివసించేటపుడు...." అని ఏదో చెప్పబోతూండగా ఆ విషయం అంతటితో ఆపమన్నట్లుగా 'టక్' అని అరిచింది కోపంగా సుశీల.

అతని చేతిలోని సిగరెట్టు వణికింది. పది క్షణాలు ఆమె కోపాగ్నిలోపడి మాడిపోయాయి.

"సమాజము, దాని సంప్రదాయాలతో నాకు నిమిత్తం లేదయ్యా అని చెబుతూ ఉంటే వినిపించుకోవేం? ఇంత శుద్ధ మూర్ఖుడివిగా ప్రవర్తిస్తావని తెలిసుంటే ఇంతవరకూ చెప్పి

## శాపగ్రస్తుడు

ఉండేదానిని కాదు. రచయితవూ — అర్థం చేసుకొనగల హృదయం ఉందని భావించాను. నీవు ఉత్త 'ఫూల్' వి." ఆమె కంఠం కంచుగంటలా ధ్వనించింది.

భాస్కర్ వికటంగా నవ్వాడు. "నెమ్మదిగా చెబుతున్నాననా నీకంత పెంకితనం వచ్చింది? నోటికి వచ్చినట్లల్లా వదరితే ప్రాణాలు తీయటమే కాదు...." అంటూ పండ్లు పటపట కొరికాడు.

"ఏంచేస్తావేంటి? చంపుతావు....అంతేగా?" నిర్లక్ష్యంగా అంది సుశీల. మరణమెలాగూ తప్పదనుకున్న జీవికి కలిగే నిర్లక్ష్యభావం ఆమెలో కన్పిస్తూంది.

భాస్కర్ పిడికిలి బిగించాడు. వేళ్ల మధ్యనున్న సిగరెట్టు ప్రాణవాయువును పీల్చుకోనలేక, కడుపులో ఉన్న కార్బన్ డై ఆక్సైడును కడుపారగా వదిలి అసువులు విడిచింది.

సుశీల నవ్వుతూ "అబలను చంపడానికింత హంగామా ఎందుకు? ఊ....చంపు" అంది.

భాస్కర్ బల్లపై ఉంచిన కలం చేతిలోనికి తీసుకొని సూటిగా ఆమె కళ్లలోకి చూస్తున్నాడు.

"ఎందుకలా చూస్తావు? నేను మరణించడానికి సిద్ధంగానే ఉన్నాను. నీ ధర్మం నీవు నెరవేర్చుకో...ఒక విషయం... చనిపోయేముందు ఎటువంటివారికైనా కొన్ని కోరికలుంటాయి. అవి తీర్చటం ధర్మం. నీవు అడిగినా అడుగకపోయినా నా కోరికలు వెలిబుచ్చుతున్నాను. నిజానికవి కోరికలు కానేకావు, శాపాలు....

"విను. నేను మధురా రచనలు చదివి అన్ని ఎంత గాఢంగా ప్రేమించానో అంతకంటె అధికంగా నీ రచనలు చదివిన 'సుజాత' నిన్ను



పూజకు

చిత్రం—పిరిశెట్టి అచ్యుతరావు (పుల్లేటికుర్రు)

వలచింది.

"మాలాగునే మీరుకూడ ప్రేమతోనిండి వాలిని వెలుంగులలో, వలపు కౌగిళ్లలో మత్తెక్కి మరపురాని బాసలు చేసుకున్నారు.

"ఆమెకు గుండెజబ్బు ఉందని నీకు తెలుసు. అయినా, ఆమెను వివాహమాడటానికి సంసిద్ధుడవయ్యావు. నీ హృదయదౌర్బల్యమటువంటిది. ప్రేమ అనే మత్తులోపడి వివేకాన్ని కోల్పోయి త్వరలో పెండ్లాడబోతున్నావు.

"వివాహమయిన కొద్దిరోజులకే ఆమె మరణిస్తుంది. ఇది నా శాపం. తప్పదు. నిజానికిది నా శాపం కానేకాదు. నీ అవివేకాన్ని, ఆమె అనారోగ్యాన్ని కలిపి నా శాపంగా మార్చుకున్నాను.

"ఆమె చనిపోయిన తర్వాత నీకు తెలుస్తుంది—బ్రతుకుమీద తీపి. చేసిన బాసలు నెరవేర్చగలిగే ధైర్యముందని నీ మనస్సెప్పుడెంత ఉబలాటపడుతున్నదో అనాడంతగా వెనుకంజ వేస్తుంది.

"ఈనాడు నాకు చెప్పిన న్యాయం, ధర్మం, నీతి ఆనాడు నీవు మరిచిపోకు. నాలాగె నీవూ బలవన్మరణాన్ని పొందు" అంటూ పమిటూడదీసి మెడచుట్టూ త్రిప్పి గొంతుక బిగించుకొని అసువులు విడిచింది.

ఆ భయానకదృశ్యాన్ని చూసి భరించలేని గోడ గడియారం 'కెవ్వున' అరిచింది.

అతని చేతిలోని 'కలం' మూర్ఛపోయి క్రిందబడింది.

అతని హృదయం బాధతో మూలుగుతున్నది.

ఒక రచయిత తను సృష్టించిన పాత్రను చంపడానికి ముందు పడ్డ భావసంఘర్షణనుంచి ఉద్భవించిన మూల్గు అది.

రచయిత ఒక ఇతివృత్తాన్ని ఎన్నుకొని, పాత్రలను సృష్టించి, తనలో ఉన్న రచనా శక్తినంతా పిండి వాటికి జీవంపోసి సజీవులనుగా చేసి, అంతటితో మిన్నకుండక తన భావాలతో వాటి 'స్వభావ' నిర్ణయం చేసి, వాటికితగ్గ అందాన్ని 'అలంకారాల' తోను, సింగారాలను శైలితోను తీర్చి, ఈ వాస్తవిక ప్రపంచంలోకి విడిచిపెడతాడు. అవి మానవులమాదిరిగానే సంచరిస్తాయి, చలిస్తాయి. అవి నడచిన పోకడలను, చలించినవాటి హృదయస్పందనాలను యథాతథంగా వ్రాసి ఒక గాథగా మనకు అందజేస్తాడు.

అప్పుడప్పుడొక్కొక్క పాత్ర అతను సూచించిన మార్గంగుండా నడువక మరొక మార్గంలో పయనిస్తానని మొండిపట్టు పడుతుంది. అదుగో, అప్పుడే రచయిత నిస్సహాయుడై తల బాదుకుంటాడు. తన భావాలతో జీవాలను పుంజుకొని తనకే ఎదురుతిరిగితే బాధపడకుండా ఉండగలడా?

తన భావానుగుణంగా బలవంతంగానైనా ఆ పాత్రను నడిపించడమా? లేక శక్తివంతమైన ఆ పాత్ర తన ఇష్టంవచ్చిన విధానంలో నడుస్తూంటే మౌనంగా అనుసరించటమా?— అనే మీమాంసలో పడి నలిగిపోతాడు. ఏదో

విధంగా సరిపుచ్చుకొని ముందుకు సాగిపోదామనుకున్నా, అది గ్రహించిన పాఠకులు విమర్శిస్తారేమోనన్న భయం అతన్ని పీడిస్తుంది.

అంతేకాదు. ఒక్కొక్కప్పుడు ఉత్తమమైన పాత్రలకు ఏ దొంగతనమో, బొంకుటమో అంటగట్టవలసి వస్తుంది. అమాయకులను అధోగతి పాల్జేయడమో, నైతికపతనం పొంద జేయడమో జరుగుతుంది. జీవితంపై ఆశగల సుశీలవంటి పాత్రలను నిర్దాక్షిణ్యంగా హత్య జేయవలసి వస్తుంది.

అటువంటప్పుడు ఆ పాత్రలు మౌనంగా విలపిస్తాయి, శపిస్తాయి కూడ—ఆ రచయితను. వాటిని వినగల సున్నితమైన హృదయం అతని కుంటుంది. ఏవి ధైర్యంగల హృదయా లప్పుడే మరచిపోతాయి. కొన్ని వేల మనస్సులు మాత్రం బాధపడుతూ ఉంటాయి—తాత్కాలికంగా.

ఆ పాత్రల శాపాలు తన జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు అనుభవించవలసి వస్తుందేమోనని అతని హృదయం బాధతో మూల్గుతూంది.

నిశాకన్య జోల పాడుతూంటే, నిద్రాదేవి చిచ్చికొడుతూంటే హాయిగా నిద్రపోయాడు భాస్కర్. అతన్ని పట్టుక పీడిస్తున్న భయాలు, బాధలు పరుగు లంకించుకున్నాయి—ఎక్కడికో.

• • •

శశాంకుడు అనారోగ్యంతో క్షీణించిపోతున్నాడు—రోజు రోజుకు. అమావాస్య అతని సింహాసనాన్ని ఆక్రమించి పుడమిని హింసిస్తూ రాజ్యమేలుతున్నది.

పదవీచ్యుతుడైన శశాంకుడు స్నేహితుడైన భానుని ఇంట తల దాచుకున్నాడు. భానుడు కనికరించి టానిక్కు కొంత ఇచ్చాడు—మిత్రునికి. అది త్రాగిన శశాంకుడు బలాన్ని పుంజుకొని సవాలుచేస్తూ అమావాస్యను రమ్మన్నాడు—తనతో యుద్ధానికి.

అతని తేజస్సు చూసిన అమావాస్య భయపడి పారిపోతున్నది — వెనుకకు తిరిగి చూడకుండా, జారిన చీరచెంగు సర్దుకొనకా....ఆమె 'పాటు' ను జూసి నవ్వుకుంటూ విశ్వసింహాసనంపై అధిష్ఠించాడు—వెన్నెలరేడు. అతని నవ్వులు వెన్నెలను కురిపించాయి.

ఆ వెన్నెల అందాన్ని, శశాంకుని చక్కదనాన్ని చూస్తున్నాడు భాస్కర్—చక్కగా అలంకరింపబడిన తన గది కిటికీలోంచి. సుగంధద్రవ్యాల వాసనలు గుబాళిస్తున్నాయి — ఆ గదిలో. మధురమైన కోర్కెలు పర్వులెడుతున్నాయి— అతని మదిలో.

గది ద్వారంవద్ద నవ్వులు వినిపించాయి. అటు తిరిగిచూశాడు భాస్కర్. అప్పుడే గదిలోకి నెట్టబడ్డ సుజాతను, తలుపులు చేరవేస్తున్న స్త్రీజనాన్ని చూశాడు. త్వరితగతిని వెళ్లి లోన గడియవేశాడు.

అమ్మలక్కలు గొల్లున నవ్వారు — గది బయట.

గదిలోని గడియారం 'గణగణ' మన్నది—పదిమార్లు.

సిగ్గుపడ్డ హృదయాలు రెండూ—చిన్నగా నవ్వుకున్నాయి.

సిగ్గుదొంతర్లమధ్య తలదాచుకుంటున్న సుజాతను సమీపించి ఆమె చుబుకంక్రింద చూపుడు వ్రేలుంచి ముఖాన్ని పైకెత్తాడు భాస్కర్.

సరాసరి అతని కండ్లలోకి చూడలేని సుజాత తన చేతులతో భాస్కర్ మెడను చుట్టేస్తూ విశాలమైన అతని వక్షంలో ముఖాన్ని దాచుకుంది. అతడామె శిరస్సును ముద్దిడుకున్నాడు.

వారి శరీరంలోని రక్తం మరుగుతున్నది. నరనాడులు ఉత్తేజపూరితాలవుతున్నాయి. ఆ తీయని బాధను భరించలేని వారిద్దరూ నరాలు పగిలేటంత గట్టిగా, ఊపిరి సలుపనంత గాఢంగా కౌగలించుకున్నారు.

అదేసమయంలో — వికృతమైన నవ్వొకటి వినిపించింది ఆ గదిలో. త్రుళ్లిపడి చూశాడు భాస్కర్. గది గోడల మూలలో, నీలినీడలలో, జుత్తు విరుగబోసుకొని పళ్లికిలిస్తూ నిల్చుంది సుశీల. భయంతో సుజాతను మరింత గట్టిగా కౌగలించుకున్నాడు భాస్కర్.

"మరణించిన ప్రేయసిపై ఇంత మమత జూపే ప్రేమికుణ్ణి, ఇంతవరకూ నేను చూడనే లేదు." వికృతంగా నవ్వుతూ అంది సుశీల. కళ్లప్పగించి చూస్తున్నాడు భాస్కర్.


"నా మాటలు బోధపడలేదా? కౌగిలి విడదీయి. నీకే తెలుస్తుంది" అంది అతని వెర్రి చూపులు చూచి.

అతను కౌగిలి విడిచాడు. సుజాత శరీరం దబ్బున నేలను పడింది. గుండెలు పగిలేలా పెద్ద కేకవేసి ఆమెపైబడి విలపిస్తున్నాడు భాస్కర్. ఆరుబయట ముచ్చటలాడుకుంటున్న పేరంటాళ్ళు, పెద్దలు ఆ కేక విని పరుగునవచ్చి తలుపు తడుతున్నారు—తెరువుమని.

"భాస్కర్! విలపిస్తూ కూర్చోవడానికిది సమయంకాదు. ఆమె గతించిన మరుక్షణమే నీవూ ఈ లోకాన్ని విడిచిపెడతానని ప్రతిన చేశావే? ఏమయ్యాయి అవన్నీ యిప్పుడు?.... పాపం....మనసొప్పటంలేదు కదూ?... అంతేలే... ఇతరుల ప్రాణం తీయగలిగినంత సులువుగా తమ ప్రాణం ఎలా తీసుకోగలరు?" వెటకారంగా నవ్వింది ఆమె.

అతను అసహ్యంగా చూశాడు సుశీలను. అతని చూపులను లెక్కచేయకుండా "ఆనాడు నాకు చెప్పిన ధర్మం, నీతి, న్యాయం నీవు మరచిపోయినా, నేను మరచిపోలేదు. ఆ విషయం జ్ఞాపకం చేయడానికే వచ్చాను. హ..హ..హ..." అని భయంకరంగా నవ్వుతూ అంది సుశీల.

"సుశీలా! నీవంటి పిరికివాణ్ణి కాదు. మనసారా నా సుజాతను ప్రేమించాను. ఆమె లేని ఈ లోకంలో ఒక క్షణముండలేను. ఇదుగో, పోతున్నాను. ముందు నీవిక్కడినుంచి పో....... పోతావా, పోవా???" అంటూ ప్రక్క టేబిలు



పాములవాడు

ఛాయాచిత్రం—పి. సంపత్‌కుమార్ (మద్రాసు-16)

పైనున్న పార్వతీ పరమేశ్వరుల విగ్రహాన్ని ఆమె పైకి కోపంతో విసిరాడు.

ఖళ్లున గాజు పగిలిన చప్పుడయింది. ఆ చప్పుడులో ఆమె పిశాచపు నవ్వు అంతర్ధానమయింది.

భాస్కర్ కడసారిగా సుజాతను కౌగలించుకొని ముద్దిడుకొని ఆమె చీరచెంగుతో గొంతు కురిపోసుకొని ప్రాణాలు విడిచిపెట్టాడు.

మధుపర్కాలు మాయకముందే, కళ్యాణ తిలకం చెరుగకముందే, చేతికందిన ఆనందాన్ని అనుభవించకముందే పరలోకగతులయ్యారు వారిద్దరూ. శాపగ్రస్తుడయాడు భాస్కర్.

తలుపులు పగులగొట్టి లోనకు ప్రవేశించారు. ఆ విగతజీవులను చూసి గొల్లుమన్నారు—అందరూ. వారి మరణానికి కారణమేమిటో తెలుసుకోలేక తెల్లముఖాలు వేసి చూస్తున్నారు—కొందరు.

ఎదురుగా గోడవార పగిలిన అద్దాలతో వికృతంగా కన్పించే బీరువా, నేలమీద ముక్కలై పడిఉన్న పార్వతీ పరమేశ్వరుల విగ్రహం తప్ప వారికింకేమీ కన్పించలేదు.

"ఇదేమిటే చోద్యం? ఎందుకిలా జరిగింది?" అని వాటిని చూస్తూ ఎవరికి వారే ప్రశ్నించుకుంటున్నారు.

"మేము చెబుతాము వినండి, యీ అమర ప్రేమికుల మరణ గాథ" అంటూ బీరువాలో ఉన్న భాస్కర్ రచనలు ఏమేమో చెబుతున్నాయి.

వాటి భాష అర్థంకాకపోయినా అర్థంచేసుకున్నట్లు వారి కండ్లు అశ్రువర్షం కురిపిస్తున్నాయి.

అర్థంచేసుకొన్న శశాంకుడు మబ్బులమాటుకు పోయి వలవల ఏడుస్తున్నాడు.

నిశాకన్య గుండెలు బ్రద్దలయేలా విలపిస్తున్నది. ప్రకృతి మాత హృదయం పగిలేలా రోదిస్తున్నది.

కాలపురుషుడు విహరిస్తూ అపట విలువ లేక ముందుకు సాగిపోతున్నాడు. ★